# పరిష్కారం

ఉమాపతిగారు మధ్యహాలులో గుండ్రని మేజాబల్లముందున్న విశాలమైన కుర్చీలో కూర్చుని తుపాకీ తుడుస్తున్నారు. రోజూ దాన్ని అలా తుడవడం ఆయనకు అదొక అలవాటు. దుమ్ముపడి చెడిపోతుందని ఆయనకు అనుమానంకూడానూ. కొంతసేపు అల్లా మెత్తని గుడ్డతో తుడిచి దాన్ని చేత్తో పట్టుకొని అటూ ఇటూ త్రిప్పి చూస్తారు. అప్పుడొక విధమైన తృప్తి కలుగుతుంది ఆయనకు.

కాని ఆ పూట అటువంటి తృప్తి కలుగలేదాయనకు. దానితో చిరాకు ఎక్కువైంది. ఎంత మనస్సు మార్చుకొందామనుకొన్నా వీలు కాలేదు. మళ్ళీ మళ్ళీ రాజారావు విషయమే మనసులో మెదుల్తోంది. నిందితుడు కంటబడ్డాక సహనం చూపడం దాదాపు చేతకాని పని ఆయనకు.

"నేను మొదటినుంచి అంటూనే ఉన్నా వాణ్ణి మాంచి క్రమశిక్షణలో ఉంచాలని. కాని సాగలా. అసలిదంతా ముసలాయన గారాబమే. ఆయనే వీణ్ణిలా పాడుచేస్తున్నారు." అనుకొన్నారాయన. అనుకోవడమేకాదు. ఆమాటలు పెద్దగా పైకేఅంటున్నారు. తనలోతాను చర్చించుకొంటున్నారు. ఆ మాటలు వినే ఆయన తండ్రి శేషాచలంగారు చేతికర్ర పుచ్చుకొని క్రిందకు దిగివచ్చి. రోజూలాగానే షికారుకని బయలుదేరినవారల్లా ఆగిపోయి, కొంచెంసేపు అల్లాగే నిలబడి కొడుకు ధోరణి కనిపెట్టి. నెమ్మదిగా "ఏమిటిరా అంటున్నావ్? రాజానుగురించేనా?" అంటూ ముందుకువచ్చి. ఆయనకు ఎదురుగా మరో కుర్చీ లాక్కొని కూర్చుని "అసలింతకూ కొత్త పిర్యాదు ఏమిటి?" అన్నారు నవ్వుతూనే.

ఉమాపతిగారు తుపాకీ ఎదురుగా ఉన్న గోడకు తగిలించివచ్చి, యథాస్థానంలో కూర్చుంటూ "మీకు చెప్పి ఏంలాభం? వాడు మీ భరోసా చూచుకునే ఇలా హద్దుమీరిపోతున్నాడు" అన్నారు.

"అబ్బ, అసలు విషయం చెప్పరా."

ఇక తప్పదని ఉమాపతిగారు ఆరోజు మధ్యాహ్నం తాను స్వయంగా చూచిన విషయమంతా సవివరంగాచెప్పి "ఇప్పుడు చెప్పండి. వా డిప్పటినుంచే సిగరెట్లు త్రాగుతూ దుష్ట సహవాసాలు చేస్తున్నాడంటే దీనికి కారణం ఏమిటి? మీ గారాబంకదూ? నాన్నచూస్తే ఏమంటాడో అన్న భయముంటే వాడిలా చేస్తాడా? వాడి ప్రక్కన కనిపించినవాణ్ణి అలా చూడంగానే తెలిసిపో యింది.వాడు కే.డీ. నెంబరువన్నని" అని ఆగి, "చూశారా మరి ఆరున్నర అయ్యింది. ఇంతవరకు ఇంటికి రాలేదు. రెండు తగిలిస్తేనే కాని వాడు దార్లోకిరాడు" అంటూ గుమ్మంవైపు చూచారు ఉమాపతిగారు,

"ఒరేయ్ అబ్బాయ్! నువ్వూరికే ప్రతి చిన్న విషయానికీ కోపం తెచ్చుకొని మనస్సు పాడుచేసుకోకు. తప్పుపని చేస్తుంటే నేనుమాత్రం ఊరుకుంటానా? చెప్పవలసిన విధంగా చెప్పి నేనవన్నీ మాన్పిస్తాను. నువ్వు ఇంక క్లబ్బుకువెళ్ళు"అంటూ ఆమాటా ఈమాటాచెప్పి అయన్ను అటు బయటకుపంపి, తానక్కడే ఒక మూలగాఉన్న సోఫాలో కూర్చొని రాజారావును గురించే ఆలోచిస్తూ అతని రాకకు ఎదురుచూస్తూ ఉండి పోయారు చాలా సేపు.

* * * *

రాజారావు చిన్నపటినుంచీ కొంత అల్లరి చేసినవాడే. "బళ్ళో మీవాడు మరీ అల్లరిచేస్తున్నాడండీ" అని ఎవరైనా చెబితే "నేను మందలిస్తాన్లెండి"

అనేవారు. అని ఊరుకొనేవారు. తానేమీ అనకపోగా ఇంట్లో ఎవరినీ కూడా మనుమణ్ణి పల్లెత్తుమాట అననిచ్చేవారు కాదు. అల్లా ఆయన రాజారావు విషయంలో గారాబం చేసినమాట వాస్తవమే. రాజారావుతల్లి పోయినప్పటినుంచీ ఆయన గారాబం ఎక్కువైంది. కాని అతని చదువు విషయంలో అయన ఎప్పుడూకూడా అశ్రద్ధచెయ్యలేదు. చెప్పిన పాఠం అప్పగిస్తేకాని కదల డానికి వీల్లేదని కట్టడిసేవారు. ఆ పాఠం వప్పగిస్తే చాలు ఇంక అతను ఎంత అల్లరిచేసినా సహించేవారు ఆ ముసలాయన.

రాజారావు చిన్నప్పుడు మహా పెంకె. కళాశాలలో చేరాక ఆ పెంకెతనం బాగా తగ్గింది. అలాగ్గా ఇంటరు పూర్తిచేశాడతను.

పిల్లవాడు పెద్దవాడయినకొద్దీ, క్రమంగా విజ్ఞత వచ్చేకొద్దీ వాడంతట వాడే బుద్ధిమంతుడవుతాడు. మనం పెద్దవాళ్ళం చేయవలసిందల్లా కాస్త కనిపెట్టిఉంటూ సరియైనదారిచూపిస్తూ ఉండడమే. ఇది శేషాచలం గారి దృష్టి.

'పిల్లలను — అందులోనూ ముఖ్యంగా మొగపిల్లలను మొట్టమొదటి నుంచీకూడా పూర్తి కట్టుదిట్టంలో ఉంచవలసిందే. ఏమాత్రం అలుసు ఇచ్చినా ఇంక వాళ్ళెందుకూ పనికిరాకుండా పోతారు. చదువు, ఐశ్వర్యం వీటి అన్నింటికంటె ముఖ్యమైంది క్రమశిక్షణ. పిల్లలకు గట్టి క్రమశిక్షణ నేర్పవలసిందే.' ఇది ఉమాపతిగారి పట్టుదల.

'ఈ రెండేళ్ళ చదువు కూడా త్వరగా అయిపోతే వాణ్ణి బారిష్టరు పరీక్షకు పంపవచ్చు ఇలా వెళ్ళి అలా బారిష్టరై వస్తాడు' అనుకొని మురిసిపోతుండేవారు శేషాచలంగారు. తాను ఒట్టి ప్లీడరుగానే బోలెడు సంపాదించ గలిగితే మనుమడు బారిష్టరై అలవోకగా లక్షలు గడించేయ గలడని ఆయన ఆశ. అదే ఆయన ఆశయం కూడానూ.

రాజారావు కళాశాలలో చేరాక చదువులోనే కాక ఆటలలో కూడా మంచి పేరు సంపాదించుకున్నాడు. బి.ఏ. లోకి వచ్చేసరికి అతను బాగా పొడుగు ఎదిగాడు. కొంచెం ఒళ్ళు చేశాడుకూడా. కలవారింటి బిడ్డడు కావడంచేత శరీరానికి మంచి ఛాయవచ్చింది. మరొకవంక ఆటల మూలంగా శరీరం గట్టిపడింది. ఫలితంగా మనిషిలో ఆకర్షణ ఏర్పడింది. అందమైన, ఖరీదైన దుస్తులు మూలంగా ఆ ఆకర్షణ ద్విగుణీకృతం అయ్యింది.

ఈ స్థితిలో అతన్ని కొందరు మెచ్చుకోవడం ప్రారంభించారు. అది అతనికి సంతోషకారణ మవుతూ వచ్చింది.

బి. ఏ.లోచేరిన క్రొత్తల్లోనే రాజారావుకు దివాకర్‌తో పరిచయమైంది. ఆ పరిచయాన్ని పురస్కరించుకొని దివాకర్ రాజారావు దగ్గరకు వచ్చి "నీఅంత అందగాడు ఈ కాలేజీ మొత్తంమీద లేడు. నీకున్న పర్సనాల్టీ సగంమంది లెక్చరర్లకు లేదు" అంటూ గడియకొక రకంగా స్తుతిస్తూ అతనితో ఇట్టే స్నేహం కట్టాడు.

స్నేహం కట్టడంలో దివాకర్ దిట్ట. మూడునెలలు తిరిగేసరికి రాజారావుకు అతనితో అపరిమితమైన స్నేహం ఏర్పడడమే కాక అతనంటే అంతులేని గురి ఏర్పడింది.

అది చాలాదూరం వెళ్ళింది,

ఒకరోజు సాయంత్రం అయిదుగంటలకు రాజారావూ, దివాకర్, ఇతరమిత్రులూ కలిసి బాస్కెట్‌బాలు ఆడుతున్నారు. ఆ ఆటస్థలం ప్రక్కగా ఒక విద్యార్థిని వెళుతున్నది. ఆపిల్ల దూరంగా కన్పించగానే దివాకర్ రాజారావును సమీపించి "అదుగో. ఆ వస్తున్నదెవరో తెలు

సునా— సుశీల. టక్కులమారి, కాలేజీ మొత్తంమీద సరియైన మొగాడే లేడంటుంది. ఉన్నాడని నువ్వు నిరూపించాలి..." అని ఒకక్షణమాగి కర్తవ్యం రహస్యంగా చెవులో ఊది "అంటే బంతి నీ చెయ్యిదాటంగానే మేమంతా నిన్ను కమ్మేసుకుంటాం. కొట్టినదెవరో ఛస్తే ఎవరికీ తెలియదు. ఊ కానీ. అదుగో దగ్గరకు వచ్చేస్తోంది" అని పురికొల్పాడు.

మరుక్షణంలో రాజారావు ఆపని చేసేశాడు. గురి తప్పకుండా బంతి వెళ్ళి ఆ పిల్లకు తగిలింది. "అమ్మో" అంటూ ఆ పిల్ల ముందుకు ఒరిగి పోయింది. ఇటు దివాకర్, అతని మిత్రబృందం రాజారావును కమ్మేసు కున్నారు.

రాజారావు అటు చూచాడు.

సుశీల ఇంకా లేవలేదు.

చుట్టూ ఉన్నవాళ్ళను త్రోసేసుకుంటూ రాజారావు ఒక అంగలో సుశీలదగ్గరకు వెళ్ళాడు.

"దెబ్బ తగిలిందా— చాలా పొరపాటైంది. చూడలేదు" అన్నాడు.

కొన్ని క్షణాలతర్వాత సుశీల నెమ్మదిగా లేచినిలబడి ఆయాసపడుతూ "నిజంగా చూడలేదా?" అన్నది కోపంగానే.

రాజారావు తలవంచుకొని "అయామ్ వెరీసారీ" అన్నాడు. మాటలు తడబడ్డాయి. ఇంతలో ఆటస్థలంనుంచి "హుర్రా-హుర్రా" అనికేకలూ, వెకిలి నవ్వులూ వినిపించాయి. వాళ్ళను వారిద్దామని రాజారావు చప్పున ఆ గుంపులోకి వెళ్ళాడు. అదంతా చూచేసరికి సుశీలకు మళ్ళీ కోపం వచ్చింది. గిరుక్కునవెనక్కు తిరిగి సరాసరి కళాశాల ప్రధానోపాధ్యాయుని దగ్గరకువెళ్ళి, రాజారావుమీద ఫిర్యాదు చేసింది. ఆయన అతన్ని పిలిపించి

చీవాట్లు పెట్టారు. క్షమాపణ కోరుకో మన్నారు. రాజారావు తలవంచుకొని నిలబడ్డాడు. అప్పుడుసుశీల ఆ గదిలోంచి చప్పున బయటకు నడిచి వెళుతూ "అవేమీ అక్కర్లేదులెండి. చేసినతప్పు తెలుసుకుంటే చాలు" అన్నది. అల్లాఅని వెనక్కు తిరిగి చూడకుండా చెరచెరా వెళ్ళిపోయింది.

'పొరపాటు అన్నాకకూడా ఈ పిల్ల ఇంతపని చేస్తుందా. ఇంతస్వల్ప విషయానికి ప్రిన్సిపాలుకు రిపోర్టుచేసి నన్ను పిలిపించి చీవాట్లుపెట్టి స్తుందా?' అనుకొని రాజారావు ఎంతో కోపగించుకున్నాడు. బాధపడ్డాడు. తనబాధ, కోపం, రోషం అంతా దివాకర్ ముందు వెళ్ళబోసుకున్నాడు. అన్నీ విని దివాకర్ "అసలుతప్పు నీదేనంటాను. అంతచక్కగా కమ్మే సుకున్న మమ్మల్ని తోసుకొని వెళ్ళావు— ఏదో బావుకొందామని. అసలదీ కాదు. సుశీల స్వభావం తెలిసివుండికూడా నిన్ను అలా వెళ్ళనిచ్చినతప్పు నాది. ఆ మనిషికెంత అహంకారమో!" అంటూ అవీ ఇవీచెప్పి అతనికి సుశీలమీద కలిగిన కోపం పెరిగేలా చేశాడు.

కాని సుశీలకు వీరిద్దరిపైనా వచ్చినకోపం ఎప్పుడో పోయింది. మామూలుగా కూడా ఆ పిల్లకు కోపంపోవడానికి ముక్కుమీదపోసిన చెమట ఆరడానికి పట్టినంత సేపుకూడా పట్టదు ఈ 'తగూ ఇంతటితో పోనివ్వండి. నేనూ తొందరపడి రిపోర్టుచేశాను. క్షమించండి.' అని రాజారావుతో అందామని సుశీల ఎన్నోసార్లు అనుకొన్నది. అతను కన్పించినప్పుడల్లా మాటలు కూడబలుక్కుని ముందుకు వెళ్ళింది కూడా. కాని రాజారావు గుడ్లురిమి చూచి తప్పుకుపోయాడు రెండుమూడుసార్లు. అతను సుశీలమీద కోపం పెంచుకున్నాడు. అందుకు దివాకర్ ఎంతో

తోడ్పడ్డాడు. మరొకవంక తనపై గురి పెరగడానికి శాయశక్తులా కృషి చేశాడు.

దివాకర్ అతన్ని కొద్దిరోజులలో పూర్తిగా మార్చేశాడు. సిగరెట్లు తాగడం ఇట్టే అలవాటు చేశాడు. సిగరెట్లకు, కాఫీహోటళ్ళకు, సినిమాలకు డబ్బు తగలెయ్యడం ఎలాగో నేర్పాడు. పెద్ద ప్రయత్నం లేకుండానే అవన్నీ రాజారావుకు అలవడినాయి.

ఆరోజు వీరిద్దరూ తరగతులు ఎగవేసి, సిగరెట్లు ధీమాగా కాలుస్తూ, బజార్లోనుంచి వెళుతుండగా ఉమాపతిగారి కంట పడ్డారు. ఆయన్ను వీళ్ళూచూచారు. చూచి తప్పు కొన్నారు, రాబోయే ప్రమాదం గుర్తించే ఆపూట తండ్రి క్లబ్బుకు వెళ్ళేసమయం గడవనిచ్చి ఇంటికి వెళ్ళాడు రాజారావు.

*   *   *   *

శేషాచలంగారు మనుమణ్ణి దగ్గరకు పిల్చి గట్టిగా చీవాట్లు పెట్టారు. "ఈ ఒక్కసారికీ నేను కల్పించుకొని సర్దిచెప్పి మీ నాన్నను బయటకు పంపాను. ఇకపైన నేను కల్పించుకోను. ఇహ నీ ఇష్టం, వాడి ఇష్టం. అయినా నువ్వు ఇల్లాతయారవుతావనుకోలేదు" అంటూ సాధించారు. రాజారావు క్షమాపణలు చెప్పు కొన్నాడు. ఇంక సిగరెట్టు ముట్టు కోనని ప్రమాణం చేశాడు. బుద్ధిగా చదువుకొంటానని వాగ్దానం చేశాడు.

కాని ఆ ప్రమాణాలూ, ఆ వాగ్దానాలూ ఆమరునాటి మధ్యాహ్నం దాకా కూడా నిలువలేదు. దివాకర్‌ను చూడగానే రాజారావు అవన్నీ మర్చిపోయాడు.

అతన్ని నిదానంగా మార్చాలని ఒకవంక శేషాచలంగారు ఎన్నో విధాల ప్రయత్నించారు. మరొకవంక దెబ్బకు దెయ్యం పారుతుందను

కొని ఉమాపతిగారు కొడుకుమీద చెయ్యి చేసుకొని అతన్ని అదుపులో పెట్టడానికి ప్రయత్నించారు.

కాని రాజారావు మారలేదు.

పైగా తప్పుదారి పట్టాడు.

అతనా దారిన అప్పటికే చాలాదూరం వెళ్ళాడు. తోటి విద్యార్థులంతా ఇంకో నాలుగు నెలల్లో పరీక్షలు వస్తున్నాయని పుస్తకాలు ముందు వేసుకొని కష్టపడి చదువుకొంటుంటే అతను దివాకర్‌ను ముందు పెట్టుకుని చదువు వెనక్కు నెట్టేశాడు. ఇకవారు ఇద్దరూ నిరంతరం ధూమపానం చేస్తూ తరగతులకు గైరుహాజరవుతూ కళాశాల వరండాలలో, చెట్లక్రిందా, అక్కడా అక్కడా తిరుగుతూ కాలక్షేపం చేస్తూ సుశీల ఎక్కడ ఒంటరిగా కనిపిస్తుందా, ఎప్పుడు ఎలా ఏడిపించి కసితీర్చుకొందామా అని ఎదురు చూచారు.

* * * *

ఒకరోజు మధ్యాహ్నం మూడు గంటలకు సుశీల రశాయనశాస్త్ర ప్రయోగశాల నుంచి తలనొప్పిగా ఉందని తోటి సహాధ్యాయినుల తోనూ, అక్కడ ఉండే ఉపాధ్యాయుని తోనూ చెప్పి ఇంటికి బయలుదేరి వెళుతోంది.

ఒంటరిగా కన్పించే సరికి రాజారావు, దివాకర్ గబగబా ఆమెకు ముందునడిచి వెళ్ళి ఆపిల్ల వరండా మలుపులో ఉండగా ఎదురు వచ్చారు.

దివాకర్ చప్పున ఆగి పెద్దగా "హాల్లో సుశీలాదేవిగారూ, ఏమిటిల్లా సడన్‌గా ఇంటికి బయలుదేరారు" అన్నాడు. అంటూనే పెద్దగా నవ్వాడు.

రాజారావు దూరంగా సిగరెట్టు తాగుతూ నిలబడ్డాడు. మరోక్షణం తర్వాత నిదానంగా "అయినా నీ కెందుకురా — పోదాంరా." అన్నాడు.

"ఏం. ఎందుకంత భయం? మళ్ళీ రిపోర్టు చేస్తుందనా" అని మళ్ళీ సుశీలవంక తిరిగి "ఏం ? నామీద రిపోర్టు చేస్తావా ?" దివాకర్ అన్నాడు.

సుశీల తలవంచుకొని ముందుకు సాగింది.

దివాకర్ ఆపిల్ల జడపట్టుకొని లాగాడు.

సుశీల చప్పున వెనుదిరిగి చూచింది. ఆ పిల్లకు కోపం. అసహ్యం ముంచుకొని వచ్చాయి. "నువ్వు కాలేజీ స్టూడెంటువా లేక బజారు మనిషివా ? ఒక్కసారి నా జోలికి రావద్దని చెబతే చాలదూ ? లే ముందు దార్లోలే" అని గద్దించింది. దివాకర్ ఆమె దారికి అడ్డంగా నిలబడి కదల కుండా "ఇది నీ దారేం కాదులేవే — మహా పతివ్రతవు దిగొచ్చావు." అన్నాడు.

రాజారావు ఈ సంభాషణ వింటూ 'జరగవలసిందే అవమానం' అనుకొంటున్నాడు. ఇంతలో సుశీల "థూ" అని దివాకర్ ముఖం మీద ఉమ్మేసి గిరుక్కున వెనుదిరిగి మళ్ళీ ప్రయోగశాలకు వెళ్ళి పోయింది.

*　　*　　*　　*

ఇక అప్పటినుంచి పట్టుదలలు పెరిగాయి. మధ్యలో రాజారావు భయపడి జారుకోవాలని ప్రయత్నిస్తే దివాకర్ "అలా ఉమ్మేసి పోతుందా ! అది నామీదపడితే ఒకటీ, నీమీదపడితే ఒకటీనా ? అది ఎంత పొగరుబోతో నువ్వు స్వయంగా చూశావుగా ! ఏమైనాసరే దాని పొగరు దించాలి" అంటూ రాజారావుకు పురి ఎక్కించాడు.

"ఒరేయ్. మొన్న జరిగినదంతా ప్రిన్సిపాలుకు చెప్పిందా ఇక నాగతి చెప్పక్కర్లేదు. ఆయన తీసుకొనే చర్య విషయం అలాఉంచి మా నాన్నకొట్టే దెబ్బలకు అంతువుండదు. ఆయనకు తెలియ కుండానూ ఉండదు, తెలిస్తే ఆయన ఊరుకోనూ ఊరుకోరు." అని తన భయం, బాధా చెప్పుకుంటే దివాకర్ "సుశీల ఇంకెప్పుడూ రిపోర్టు చెయ్యదు. చేస్తే ఇంకా కాలేజీకి రావడానికే వీలుండదని దానికి తెలుసు. సుశీలకు లోపల నేనంటే ఎంత భయమో నీకేం తెలుసు?" అంటూ ఎన్నో రకాలుగా ధైర్యం చెప్పాడు.

అల్లా ధైర్యంచెప్పి అతన్ని ఒప్పించిన మరునాటి సాయంత్రమే సుశీల కళాశాలనుంచి ఇంటికి వెళుతూ ఒంటరిగా కన్పించింది. దివాకర్ రాజారావును చెయ్యిపుచ్చుకొని గబగబా ముందుకు లాక్కొని వెళ్ళాడు. కళాశాల గేటు దాటకముందే దివాకర్ సుశీలను కలుసుకొని "పాపం! ఒంటరిగా వెళుతున్నారు. నేను తోడురానా?" అన్నాడు. సుశీల వెనక్కు తిరిగి చూచింది. అంత దగ్గరలో అతని ముఖం కన్పించగానే ఆపిల్లకు ఒళ్ళు కంపరమెత్తింది. అసహ్యం వేసింది. గట్టిగా సమాధానం చెబుదా మనుకున్నది మొదట. కాని అంతలో దూరంగా నిలబడ్డ రాజారావునుచూచి మనసు మార్చుకొని, తలవంచుకొని, చెరచెరా ముందుకువెళ్ళబోతుంటే దివాకర్ మీద మీదకు వస్తూ "నిన్నేనే" అన్నాడు.

సుశీల ఆగి, "పోలీసును పిలవమంటావా?" అన్నది.

"రాత్రికి పిలు వస్తాడు" అన్నాడు దివాకర్ వెంటనే. అని పెద్దగా నవ్వాడు. సుశీలకు కోపంతో వళ్ళు మండిపోయింది. అయినా తమా యించుకొని "చూడండి రాజారావుగారూ, మీ ఫ్రెండ్ ఎలా మాట్లాడు తున్నాడో" అంటూ అతని సహాయం అర్థించింది. దివాకర్ సంజ్ఞ

చేస్తే రాజారావు సుశీల మాటలు వినిపించుకోకుండా కొంచెం దూరంగా తప్పుకొన్నాడు.

దివాకర్ "వాడెందుకు? నే వస్తాగా" అన్నాడు మళ్ళీ నవ్వుతూ. నవ్వుతూ ముందుకువచ్చి నిలబడ్డాడు.

సుశీలకు ఏమి చెయ్యడానికీ తోచలేదు, వెనుదిరిగి చూచింది. సహాయం చేయగలవారు ఎవరూ కన్పించలేదు. వీడేంచేస్తాడో అనుకొని భయ పడ్డది.

ఆమె నిలువునా వణకడం గమనించి మరింత ధైర్యం తెచ్చుకొని. వెకిలిగా నవ్వుతూ "అంత భయందేనికీ- నీ తల్లికి లేనిభయం నీ కెందుకూ!" అన్నాడు దివాకర్.

సుశీల ఆతనివైపు గుడ్లురిమి చూచింది. "పిచ్చిమాటలు మాట్లాడేవా పళ్ళు రాల్తాయి," అనుకోకుండా, అప్రయత్నంగా అనేసింది.

"ఏమిటి? మహ పేల్తున్నావ్| పంతులమ్మ కూతురివి. మీ అమ్మ స్కూలు ప్రెసిడెంటు సేవచేస్తేగాని నీకూ ఆవిడకూ గడవదు— నీకింత పొగరా...." అంటూ దూకుడుగా మీద మీదకు వెళ్ళాడు దివాకర్.

సుశీల కోపంతో రెచ్చిపోయింది. ఒళ్ళుమర్చిపోయింది.

వెంటనే కాలిచెప్పు తీసుకొని "మళ్ళా ఇలాంటి కూత కూస్తావా?" అంటూ అతని దవడమీద ఫెడేలుమనికొట్టింది. "సుశీలా సుశీలా"అంటూ పరుగుపెడుతూ దగ్గరకు వస్తున్న రాజరత్నం కన్పించేసరికి మరింత ధైర్యం తెచ్చుకొని "అంత నోరు కొవ్వెక్కిందా? అన్యాయంగా నన్ను అనడమే కాక మా అమ్మనే అంటావా" అంటూ ఆ చెప్పుతోనే రెండో దవడమీదకూడా గట్టిగా కొట్టింది.

దివాకర్ సిమ్మెంటు దిమ్మలా నిలబడిఉన్నాడు రాజరత్నం అక్కడికి వచ్చేసరికి.

రాజరత్నం వచ్చి వారిద్దరిమధ్యగా నిలబడ్డది.

సుశీల అంతపని చేస్తుందని రెండు చెప్పుదెబ్బలూ తిన్న దివాకర్ కానీ, అల్లంతదూరంలో నిలబడ్డ రాజారావుకానీ. పరుగెత్తుకుంటూ వచ్చిన రాజరత్నంకానీ అనుకోలేదు.

"ఇదుగో— సుశీలా. కదలవేమే— అతనితో నీకెందుకు రా" అంటూ నిలువునా వణికిపోతూ ఇంకా ఏదో అందామని ప్రయత్నం చేస్తున్న సుశీలను బలవంతంగా ఇంటికి తీసుకొని వెళ్ళింది రాజరత్నం. వాళ్ళు వెళు తుంటే వెనుకనుంచి పెద్దగా దివాకర్ 'పురాణ'పఠనం ప్రారంభించాడు.

రాజారావు వచ్చి దివాకర్‌ను "రారాబాబూ. చూడునలుగురూ పోగవు తున్నారు. ఇంక చాల్లే పద" అంటూ అతన్ని బలవంతంగా అవతలకు నెట్టుకొని వెళ్ళి, కొంతదూరం వెళ్ళాక చెయ్యి పుచ్చుకొని, అతనిగదికి తీసుకొని వెళ్ళాడు. అతను సుశీలను వారిపోడుగునా తిడుతూనే ఉన్నాడు. "ఊరుకోరా బాబూ" అని రాజారావుఏన్నోవిధాల బ్రతిమలాడుతూనే ఉన్నాడు.

సుశీల ఈ విషయం కళాశాల ప్రధానోపాధ్యాయునకు పిర్యాదు చేస్తుందేమోననీ, ఆయన ఈ విషయాలన్నీ తండ్రికి చెబుతా రేమోననీ రాజారావు ఎంతో భయపడ్డాడు.

కాని సుశీల ఎవరికీ పిర్యాదు చేయలేదు. రాజరత్నం వాళ్ళు "పోసీ రాజారావు తాతగారితో చెబుదాం రా. ఆయన రాజారావును మందలించి

ఆ స్నేహం మాన్పిస్తాడు. పోలీసు ఆఫీసరుకొడుకు తనప్రక్కన ఉన్నా డనే దివాకర్ ధీమా. రా వెళదాం" అని ఎంత బలవంత పెట్టినా సుశీల అంగీకరించలేదు. పైగా ఈ వ్యవహారమంతా పూర్తిగా మర్చిపోడానికే తాపత్రయ పడ్డది సుశీల.

కాని ఆప్రయత్నం సాగలేదు. దివాకర్ సరికొత్త ప్రచారం మొదలుపెట్టాడు. సుశీల శీలం మంచిదికాదట. ఆ పిల్లముందు కొంత కాలం తనతో ప్రేమకలాపాలు సాగించిందట. కాని ఇప్పుడు రాజారావు వెంట పడుతున్నదట. ఇది మంచిపద్ధతి కాదు అని నచ్చచెప్పడానికి తాను ప్రయత్నిస్తే ఆమె అసభ్యంగా రౌడీలాగా ప్రవర్తించిందట. అయినా నిజమైన ప్రేమ ఉందికనుక తను ఇంకా సహించి ఊరుకొంటున్నా డట!'

ఇదీ అతను అల్లిన కథ.

ముందు ఒకరిద్దరితో చెప్పుకొన్నాడు. ఆ తర్వాత దానంతట అదే ప్రచారమైపోయింది.

కళాశాలలో ఎక్కడచూచినా ఇదేగొడవ. సుశీల తల ఎత్తుకొని తిరగ డానికి వీలులేక పోయింది. మొగపిల్లలు తనవెనక అంటున్నమాటలు వినలేక పోయింది. వాళ్ళ సంగతి అలా ఉండగా తోటి ఆడపిల్లలు ఏడి పించిన ఏడిపింపు ఇంతా అంతా కాకపోయ్యేసరికి సుశీల ఆడపిల్లల గది లోనే చీరకొంగు గొంతుకు ఉరిపోసుకుందామను కొన్నది చాలాసార్లు.

సుశీల అంత బాధపడ్డది.

సుశీల అలా బాధపడుతున్నప్పుడే రాజరత్నం ఆదుకొని, మిగతా ఆడపిల్లలంతా వెలివేసినపిల్లను దగ్గరకుతీసి, "నీకేం భయంలేదు. నువ్వేం

తప్పు చెయ్యనప్పుడు ఎందుకిలా బాధపడడం. ఎవరేమన్నా అనుకోనీ నువ్వు పట్టించుకోకు. ఇంక రెండునెలల్లో పరీక్షలు వస్తున్నాయి. బాగా చదువు" అని ఓదార్చి ధైర్యం చెప్పింది.

"నువ్వు ఎన్నిరకాలుగా బాధపడుతున్నావో నాకు తెలుసు. వాడేమో శకారుడులా నీ వెంట పడ్డాడు. పగబట్టాడు. నువ్వు ఎవర్ని అభిమానిస్తు న్నావో అతను విషసర్పం చుట్టుకున్న గంధపుచెట్టు. నీ పరిస్థితి ఎంత దైన్యంగా ఉందో నాకు తెలుసు. కాని ఇప్పుడే నువ్వుధైర్యంగా ఉండాలి. ఇవన్నీ మరచిపోయి ముందు పరీక్ష వ్రాసుకో. మీ అమ్మ నీమీద ఎన్నో ఆశలు పెట్టుకొన్నది:" అంటూ ఆమె బాధ పంచుకుంటూ చదువు విషయంలో సుశీల దీక్ష వహించడానికి ఎంతోడ్పడింది రాజరత్నం.

పదిహేనురోజుల తర్వాత సుశీలకు రాజారావు కళాశాల గ్రంథా లయంలో ఒంటరిగా కన్పించాడు. అలా అతను ఒంటరిగా ఎప్పుడు కన్పిస్తాడా ఎప్పుడు వెళ్ళి తాను తొందరపడి నందుకు క్షమాపణ చెప్పు కొందామా అని అన్ని రోజులూ ఎదురుచూచింది సుశీల. అంతకుముందు ఎప్పుడుకన్పించినా అతనివెంట దివాకర్ ఉంటూనేఉన్నాడు. "ఇప్పుడే వస్తానుండు" అని రాజరత్నంతో చెప్పి సుశీల ముందుకువెళ్ళి రాజా రావును పలుకరించింది.

అతను కొరకొరా చూచాడు.

"ఎందుకండీ అంత కోపం. మీ స్నేహితుణ్ణి కొట్టాననేనా ? పొరపాటే చేశాను. ఆ కోపంలో నావళ్ళే నాకు తెలియాలా. కాని అతను నన్నేకాదు – కన్నతల్లిని - మా అమ్మను అంతంత మాటలంటాడా అన్యాయంగా. ఆమాటే మీ అమ్మగారిని అంటే మీరేం చేశేవారో ? పోనీ మీరు అక్కడే ఉన్నారుగా. సహాయం అర్థించినా సహాధ్యాయిని

కదా అన్న అభిమానం చూపించలేక పొయ్యారే!..." అని ఇంకా ఏమో చెప్పబోయి, ఆవేశపడిపోయింది. అనుకోకుండా దుఃఖం వచ్చింది. గొంతు తడి ఆరి పోయింది. రెండుచేతులూ ముఖంమీద కప్పుకొని ఏడుస్తూ "పోనీ తప్పంతా నాదే అనుకోండి. పొరపాటు — క్షమించండి" అన్నది పూడిపోయినట్లున్న గొంతు సవరించుకొంటూ.

"మొగుణ్ణి కొట్టి మొరపెట్టుకొన్నట్లుంది. అన్నీచేసి ఇప్పుడీ ఏడుపెందుకు!" అన్నాడు రాజారావు.

అంతలోకే ప్రక్కన ఉన్న పుస్తకాలబీరువా వెనకవైపునుంచి ముందుకువస్తూ దివాకర్ "ఒరేయ్ రాజారావు నువ్వు ఆపిల్లతో మాట్లాడ వద్దని చెప్పలేదురా. ఈపిల్ల చూశావూ కొట్టనూ కొడుతుంది. కొట్టిస్తుంది. పైగా ఏడవనూ ఏడుస్తుంది. అంతా నాటకం. నీ కేంతెలుసు ఈ మనిషి స్వభావం. షీ యీజ్ సచ్ ఏ బాడ్ గర్ల్. క మెలాంగ్" అని చెయ్యి పుచ్చుకొని లాగాడు.

"ఎవరెటువంటివారో తెలుస్తూనే ఉన్నది. అయినా నీకేం సంబంధం నువ్వు కల్పించుకుంటావ్?" అన్నది సుశీల కోపంగా.

"ఏం నీకు అడ్డం వచ్చానా నేను!" అని దివాకర్ కావాలని పెద్దగా అరిచాడు. దాంతో గ్రంథాలయంలో అక్కడక్కడ ఉన్నవారంతా అక్కడ పోగయ్యారు.

దివాకర్ నిర్భయంగా తిట్టాడు.

సుశీల కూడా ఊరుకోలేదు.

రాజరత్నం వచ్చి వారించింది.

కాని ప్రయోజనం లేకపోయింది. మరో పది నిముషాల తర్వాత

గ్రంథాలయనిర్వాహకులు వచ్చి ప్రిన్సిపాలుగారు పిలుస్తున్నారు రమ్మని సుశీలను, రాజరత్నాన్నీ అవతలకు తీసుకొని వెళ్ళారు.

విషయమంతా ఆయనకు చెప్పక తప్పనిసరైంది. సగంలో ఆపడానికి సుశీల ప్రయత్నిస్తే రాజరత్నం అందుకొని "ఇక్కడ భయపడడం దేనికి?" అంటూ విషయమంతా మొదటినుంచీ చెప్పింది.

ఆయన అంతా విని "సరే, మీరు వెళ్ళండి. నేను విచారిస్తాను," అని వాళ్ళను, ఇద్దరు కళాశాల నౌకర్లను తోడు ఇచ్చి ఇళ్ళకు పంపి, అన్ని విషయాలూ విచారించారు. ఆ మరునాడే దివాకర్‌నూ, రాజారావునూ కళాశాలనుంచి 'సస్పెండు' చేశారు. పెద్దవాళ్ళు వచ్చి మాటాడితేకాని మళ్ళీ కళాశాలలో చేర్చుకోననీ, పరీక్షకు పంపననీ కబురు చేశారు. దివాకర్ ఇంటికి కార్డు వెళ్ళింది. కళాశాల నౌకరు రాజారావు ఇంటికి స్వయంగా వెళ్ళి ఉమాపతి గారికే ఆ ఉత్తరం ఇచ్చాడు.

ఆ రోజున రాజారావుతిన్న దెబ్బలకు అంతూ పొంతూ లేదు.

"వీణ్ణి ఒక్కణ్ణీ దండిస్తేచాలదు, వాడికీ రెండుతగలాలి" అని అనుకొని ఉమాపతిగారు మనిషిని పంపి, దివాకర్‌ను ఇంటికి పిలిపించి కళాశాల నౌకరు ముందే నిల్చోపెట్టి, వెడల్పాటి తోలుబెల్టు పుచ్చుకొని, అతన్ని బాది బాది వదలిపెట్టారు. అక్కడికీ కోపంతీరక చొక్కాపుచ్చుకొని ముందుకూ వెనక్కూ గుంజి చెంపదెబ్బలు కొట్టి "నా కన్ని విషయాలూ తెలిశాయి. నిన్నింక వదిలి పెట్టను. నువ్వుగానీ వీడుగానీ ఆపిల్ల జోలికి- ఆ పిల్లే కాదు కాలేజీలోవ ఆడపిల్ల జోలికైనా పొయ్యారంటే ఎదురుగా నిల్చోపెట్టి కాల్చి పారేస్తా. తెలిసిందా? జాగ్రత్త - జ్ఞాపకం పెట్టుకో - పో అవతలకు" అని బయటకు నెట్టారు ఉమాపతిగారు.

దివాకర్ వారింటినుంచి తనగదికి వచ్చేదాకా తలఎత్తలేదు.

ఇంతజరిగిందని తెలిసికళాశాల ప్రధానఅధ్యాపకులు ఎంతో నొచ్చు కున్నారు. ఇంత పెద్దశిక్షపడుతుందని ఊహించలేదు సుమా! అనుకొని చాలాబాధపడ్డారాయన. 'పెద్దవాళ్ళు వచ్చి ఏమీచెప్పనక్కరలేదు, కాలేజీకి వచ్చేయండి' అని ఆయిద్దరికీ కబురు చేశారాయన ఆ మరునాడే.

తానింక కళాశాలకు వెళ్ళనన్నాడు రాజారావు.

వెళ్ళితీరా లన్నారు ఉమాపతిగారు.

వెళ్ళి, అక్కడ జరిగే అవమానంకూడా భరించితీరాలని ఆయన పట్టుదల. దాని మూలంగా అతనికి బుద్ధివస్తుందని ఆయన ఆశ. అందుకే "వెళ్ళు, వెళ్ళి ఇకనుంచి బుద్ధిగా మసలుకో" అనిచెప్పి బలవంతంగా రాజారావును తిరిగి కళాశాలకు పంపారు.

కొన్నాళ్ళదాకా దివాకర్ రాజారావు ఒకరినొకరు పలుకరించు కోలేదు. దూరంగా తప్పుకొనితిరిగారు.

దివాకర్‌కు సుశీలమీద పగ పెరిగింది. క్రొత్తగా రాజారావుమీద కూడా పగ ఏర్పడింది. ఉమాపతిగారు చేసినపనిజ్ఞాపకం వచ్చినప్పుడల్లా క్రోధంతో ఊగిపొయ్యే వాడతను. పగ తీర్చుకోడానికి రాజారావుతో స్నేహం వదులుకోవడం పద్ధతి కాదనుకున్నాడు, నెమ్మదిగా మళ్ళీ అతనిదగ్గర చేరాడు. పూర్వస్నేహాన్ని తిరగతోడాడు, అంతలో అతను జలగలా రాజారావుకు అతుక్కుపోయాడు. తమ స్నేహం ఒకస్థాయి అందుకొన్న తర్వాత "ఏరా. ఇన్ని విధాల మన్ని అవమానపరచిన దాన్ని అలా వదిలెయ్యడమే! ఎంత దుర్మార్గం చేసిందిరా? ఇంట్లోచెప్పి, ప్రిన్సిపాలుకు చెప్పి మన్ని తన్నిస్తుందా! పైగా ఇప్పుడుచూడు ఏమీ ఎరగని నంగనాచిలా ఎలా ఎంత నిర్భయంగా, దర్జాగా తిరుగుతోందో?" అంటూ నెమ్మదిగా ఆ విషయాలు కదిపి సుశీలమీద బాగా కోపంవచ్చేలా

చేశాడు దివాకర్. రాజారావుకు సుశీల మీద మొదట వచ్చిన కోపమంతా భయంగా మారిపోయింది. ఏమంటే – ఏంజరుగుతుందో అని భయపడి బలవంతంగా కోపాన్ని చంపుకొన్నాడు. కాని దివాకర్ ప్రబోధంతో అతని కోపం మళ్ళా రాజుకొన్నది.

"దాని పొగరు అణచకపోతే మనం ఇక జన్మలో తలఎత్తుకో గలమా? అందరూ మన్నిచూచి నవ్వుతున్నారు – ఆడపిల్లచేతిలో ఓడి పొయ్యామని నేను కన్పించినప్పుడల్లా గేలిచేస్తూ ఆడపిల్లలే నవ్వు తున్నారు." అంటూ విసుగూ విరామం లేకుండా దివాకర్ చెబుతుంటే రాజారావు వినివిని చివరకు ఒకరోజు "ఏం చేస్తే సుశీల తిక్క కుదురుతుందో చెప్పు చేస్తా" అన్నాడు.

"ఇన్నాళ్ళకు దార్లోకి వచ్చాడు." అనుకొని దివాకర్ ఎంతో సంతోషిస్తూ, కాని ఆ సంతోషం పైకి కన్పించకుండా అణచుకొంటూ "నేచెబుతారా" అని దగ్గరకుపిల్చి రహస్యంగా చెవులో చెప్పాడు. చెప్పి, "దాంతో అదికాదు దాని తలలో జేజెమ్మ దిగివస్తుంది" అన్నాడు.

రాజారావు మొదట ఆ విషయం వినడానికే భయపడ్డాడు. 'అమ్మో! ఎవరికైనా రిపోర్టు చేసిందీ అంటే–ఇంకేమన్నా ఉందా" అని ఏమో చెప్పబోతుంటే దివాకర్ అడ్డువచ్చి "ఇంత అమాయకుడి వేమిరా నువ్వు! నీకా భయమేమీ అక్కరలేదు. చస్తే ఏ ఆడపిల్ల కూడా అల్లాంటిది బయటపెట్టదు. తల్లికి కూడా చెప్పుకోదు. ఎవరికైనా పొరపాటున చెప్పు కుంటే దానికే నష్టం" అని, ఏమి నష్టమో అంతా సవిరంగా చెప్పాడు.

"నిజమే" అన్నాడు రాజారావు చివరకు. అతని మనస్సుకుకూడా అల్లాగే అనిపించింది.

దివాకర్ పథకం చెప్పాడు. అమలు జరిపే పద్ధతి వివరించాడు. అన్నిటికంటె ఎక్కువగా ధైర్యం చెప్పాడు.

ఒక వారం తిరక్కముందే దివాకర్ పథకం అమలుపరచడానికి అవకాశం కలిగింది. సుశీల రాజరత్నం ఇంటి దగ్గర నుంచి వస్తున్నది. సుశీలా రాజరత్నం ఇద్దరూ కలిసి కబుర్లూ చెప్పుకొంటూ వస్తూఉండగా వీళ్ళ కంట పడ్డారు.

వాళ్ళు ఇద్దరూ తోటదాకా వచ్చేవరకూ దూరంగా వాళ్ళకు కనిపించకుండా వెనుక నడుస్తూ దివాకర్, రాజారావు వాళ్ళవెంటపడ్డారు. తోట గేటు దగ్గర దివాకర్ "పద" అని ముందుకు తోస్తే రాజారావు ముందుకు వెళ్ళి వాళ్ళిద్దర్నీ నవ్వుతూ పల్కరించాడు. "బాగా చదువుతున్నారా" అని.

రాజరత్నం సమాధానం చెప్పింది.

సుశీల తల వంచుకున్నది.

దివాకర్ దూరంగా తప్పుకున్నాడు.

రాజారావు హఠాత్తుగా సుశీలవైపు తిరిగి కొంచెం పెద్దగా "సుశీలా, నీతో ఓ విషయం మాట్లాడాలి విడిగా" అన్నాడు. "అక్కర్లేదు" అని సుశీల వెళ్ళిపోబోతుంటే అతను చెయ్యి అడ్డం పెట్టాడు.

సుశీల ఆగి వెనుక్కు అడుగు వేసింది.

ఏదో స్ఫురణకు వచ్చి వెనుతిరిగి చూచింది. భయపడిన లేడి పిల్లలా పరుగెడుతున్న రాజరత్నం కన్పించింది.

"ఏం నువ్వు పారిపోదామనుకుంటున్నావా? వీల్లేదు. నే చెప్పేది విని మరీ వెళ్ళాలి" అన్నాడు రాజారావు.

"అయితే చెప్పండి" అన్నది సుశీల.

"ఇక్కడకాదు; అలా లోపలకు వెళ్ళి మాట్లాడుకొందాం రా" అని అంటూనే రాజారావు సుశీల చెయ్యి పుచ్చుకొని గబగబా ఆపాడుపడిన తోటలోకి లాక్కొనివెళ్ళాడు.

గేటుదగ్గరే కేకలేద్దామనుకొన్నది సుశీల. కాని అల్లరి అవుతుందని భయపడ్డది. ఏమో. నేను అనవసరంగా-భయపడుతున్నానేమో: అతను దుర్మార్గమేమీ తలపెట్టడేమో! అనుకొన్నది అంతలో.

కాని మరో నిముషం తర్వాత తన ఊహ, తన నమ్మకం తప్పని తేలిపోయింది. నిలువునా వణికిపోయింది. చెయ్యి విడిపించుకోవాలని పెనుగులాడింది. గోళ్ళుతగిలి చేతులమీదా అక్కడా చీరుకొనిపోయింది. గాజులు చిట్లిపోయి మణికట్టుదగ్గర గాయాలయ్యాయి. వెక్కి వెక్కి ఏడుస్తూ వదిలిపెట్టమని బ్రతిమలాడింది.

ఎక్కడినుంచో ఎవరో పిలిచినట్లు వినిపించింది. రాజారావు చప్పున చెయ్యి విడిచిపెట్టి సుశీలను వెనక్కి ఒక్కతోపు త్రోసి పరుగు పెట్టాడు. సుశీల వెనక్కితూలి పడిపోతూ వెనుదిరిగి చూచింది. రాజ రత్నం, రాజరత్నం అన్న, పరుగుపరుగున వస్తున్నారు-'సుశీలా సుశీలా' అని అరుస్తూ.

* * *

రాజారావు ఆపూట ఇంటివైపు వెళ్ళడానికే భయపడ్డాడు. అతను దివాకర్‌ను వెతుక్కుంటూ అతని గదికి వెళ్ళాడు. ఎవరైనా తనవెంట వస్తున్నారేమోనని దారిపొడుగూతా వెనక్కి తిరిగి చూస్తూ వణికిపోతూ వచ్చాడు. అతను గుమ్మంలో కన్పించగానే దివాకర్ లేచి యుద్ధవీరుణ్ణి గౌరవించినంతగా గౌరవించాడు. ఆ తరువాత ఏం జరిగిందో చెప్పమని ఆత్రంగా అడిగిన ప్రశ్నే మళ్ళీ అడుగుతూ విన్నదే వింటూ పరమానంద భరితుడయ్యాడు.

రాజారావు ఇంకా వణికిపోతూ తన భయం గురించి చెప్పుకొంటే దివాకర్ పెద్దగా నవ్వుతూ "అటువంటి భయం నీకేమీ అక్కరలేదు. ఇక అది చచ్చిన పేనల్లే ఉంటుంది. తను స్వయంగా ఆ విషయం ఎవరికీ చెప్పదు. మరొకళ్ళను చెప్పనివ్వదు! నువ్వు పూర్తి విజయం సాధించి ఉంటే మరీ బాగుండేది. దాంతో దాసీత్వం స్వీకరించేదనుకో. అయినా ఫర్వాలేదు" అన్నాడు.

అంటూనే నడుంవాల్చి నిద్రకు ఉపక్రమించాడు. అతనికి ఎంతో తృప్తి కలిగింది. ఇద్దరిమీదా పగ ఇంత సులభంగా సాధించగలిగినందుకు తన్ను తాను అభినందించుకొన్నాడు. "ఇటు సుశీలాకా పెళ్ళి కాదు. అదొక లాభం. ఇది దాగే విషయం కాదు కనుక ప్రచారం అవుతుంది. ఉమాపతిగారి పరువు దెబ్బ తింటుంది. గర్వం అణుగుతుంది" అనుకొంటూ అతను సుఖంగా నిద్రపోయాడు.

కాని రాజారావుకు నిద్రరాలేదు, వణుకు తగ్గలేదు. మరికొంత సేపటికి వళ్ళు వేడెక్కి పోయింది. ఏమేమో పలవరిస్తూ పక్కలో రాత్రి చాలా సేపు దొర్లుతూనే ఉన్నాడు.

ప్రక్కనే పడుకొన్న దివాకర్ కదలలేదు. మెదలలేదు.

తూర్పు తెలతెలవారుతుండగా ఎవరో తలుపు తట్టిన చప్పుడైతే దివాకర్‌కు మెలకువ వచ్చింది. వెళ్ళి కిటికీలోనుంచి చూచాడు. బయట తలుపు దగ్గర కాకీ నిక్కర్లు, కాకీ చొక్కాలతో బీడీకాలుస్తున్న ఇద్దరు వ్యక్తులు కన్పించారు. వాళ్ళు కన్పించగానే దివాకర్‌కు పైప్రాణాలు పైనే పోతున్నాయనిపించింది. "ఇది నన్ను ముంచిపోయింది. రిపోర్టు చేసిందన్నమాట; వెతుక్కుంటూ వచ్చారు. ఇంకేముంది" అనుకొని నిలువునా వణికిపొయ్యాడు. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకొంటూ వెళ్ళి

గడియతీసి పిల్లిలా వెనుక గుమ్మంవైపు వెళ్ళి, చప్పుడు కాకుండా తలుపు తీసుకొని, ముందు దొడ్లోకి, ఆ తర్వాత దొడ్డివైపున్న సందులోకి, అటు తర్వాత ఊరి బయటకు, ఆ పిమ్మట ఊరువిడిచి భయం బ్రహ్మ రాక్షసై వెంటపడి తరుముతుండగా స్వగ్రామానికీ ఉడాయించాడు.

ఆ వచ్చిన 'ఆర్డర్లీలు' ఇద్దరూ కొంత సేపటికి తలుపు దగ్గరవేసి ఉన్నట్లు గమనించి, నెమ్మదిగా నెట్టుకొని లోపలకు వచ్చి, రాజారావును నిద్రలేపి, ఆ వీధి మలుపుదాకా నడిపించి, అక్కడ నుంచి జీపులో ఎక్కించుకొని ఇంటికి తీసుకొని వెళ్ళారు.

వాళ్ళను గుమ్మంలోనుంచే బయటకు పంపించేస్తూ ఉమాపతిగారు "ఏరా? వచ్చావా? రా" అన్నారు రాజారావుతో.

రాజారావు లోపలకు అడుగు పెడుతూనే మేడపైకి వెళ్ళే మెట్లవంక చూచాడు. తాతగారి గదికి బయటగొళ్ళెం పెట్టి ఉంది.

గర్జించినట్లు వినిపించింది రాజారావుకు.

తలఎత్తి చూచాడు. అతనికి కాకీ యూనిఫారంలో పోలీసు ఉద్యోగి కన్పించాడు. ఆయన కళ్ళు చింతనిప్పుల్లా వెలిగిపోతున్నాయి.

రాజారావు మాటాడకుండా అక్కడే నిలబడిపొయ్యాడు. ఆయన చప్పున ముందుకువచ్చి "నే నీ బాధ భరించలేను. సుశీలా, రాజరత్నం వాళ్ళు లేడీ డాక్టరు దగ్గరకు వెళుతూ ముందిక్కడకు వచ్చి వెళ్ళారు. సరే. అవన్నీ ఎందుకు? నువ్వు నిజం చెప్పు. త్వరగా చెప్పు. నువ్వీ నేరం చేశావా లేదా?" అన్నారు.

చెయ్యలేదు అంటాడని ఆయన ఊహ. చేసి ఉండడనీ, దివాకర్ ఏదో కుట్రపన్ని ఉంటాడని ఆయన విశ్వాసం.

రాజారావు ఒక్కక్షణం మాటాడలేదు. ఆయన మళ్ళీ గర్జించారు. బొంకి ఇంక లాభం లేదని అతను వెంటనే నేరం ఒప్పుకున్నాడు. అతను అనుకొన్నదానికి భిన్నంగా ఆయనకు కోపం ముంచుకొని వచ్చింది. చప్పున ముందుకువచ్చి అతని చొక్కా పట్టుకొని "అయితే నిజమేనన్న మాట. కాదేమో అనుకొంటున్నా ఇందాకటినుంచీ. నువ్వింత తెగిస్తావని ఊహించలేకపొయ్యాను. దీనికి రేపొద్దున్న కోర్టు ఏం శిక్ష విధిస్తుందో తెలుసా?" అని చొక్కా గుంజుతూ "వెధవా, జైలుశిక్ష వేస్తార్రా. నా కొడుకు ఇటువంటి నేరంచేసి జైలుకువెళితే నేనింక బ్రతకగలనా? ఛీ-చెడబుట్టావు" అని ఆయాసపడుతూ ఒక్క క్షణం ఆగి, మళ్ళీ అందుకొని "కోర్టు నిన్ను విచారించి శిక్ష విధించేదాకానా-ఛీ-నడువ్-వెళ్ళి అక్కడ నుంచో" అని ఉరిమిచూస్తూ "వెళ్ళు..." అని పెద్దగా ఆజ్ఞాపించారు.

మతిపోయినవాడులా తల వ్రేలాడవేసుకొని రాజారావు వెళ్ళి ఆయన నిలబడమన్న చోట గోడకు ఆనుకొని నిలబడ్డాడు.

ఉమాపతిగారు కోపంతో ఊగిపోతూ తుపాకీ తీసుకొని, దూరంగా వెళుతూ, ఒకసారి వెనుదిరిగి "నువ్వు కాల్చుకొని చావవలసింది. పిరికి వెధవ్వు. ఆ భారం నేనే వహిస్తా" అంటూ పళ్ళు పటపట కొరికారు. మరుక్షణంలో కుర్చీ వెనుకగా వెళ్ళి నిలబడి, రాజారావు గుండెకు తుపాకీ గురిపెట్టారు.

ఒకసారి గురిపెట్టాక ఇక సవరించుకోవలసిన అవసరం లేదాయనకు. గురి తప్పడం ఆయన ఎన్నడూ ఎరగని విషయం. గురిపెట్టి, తల వంకరగాపెట్టి వంగి చూచారు. తుపాకీ ఉపరిభాగం మీదుగా, గుండ్లు వాయువేగాన్ని అధిగమించి గమించే మార్గంపైయెత్తుగా, అటుతర్వాత దాని లక్ష్యంపైనా ఆయన దృష్టులు అప్రయత్నంగా ప్రసరించినాయి.

అంతలో ఆయన చేతి వేలు తుపాకీ మీట మీదకు వెళ్ళింది.

మరుక్షణంలో "ఢాం" అని పెద్ద శబ్దంతో తుపాకీ ప్రేలింది. హాలంతా ఒక్కసారి దద్దరిల్లిపోయింది.

తుపాకీ ప్రేలిన మరుక్షణంలోనే ఉమాపతిగారికితాను చేసిన పనేమిటో తెలిసివచ్చింది. ఆయన మనస్సు ఒక్కసారి వికావికలై పోయింది. గుండె బేజారై పోయింది. ముక్కు పచ్చలారని కుర్రకుంకను ఒక్కగానొక్క కొడుకును. అందులోనూ తల్లిలేని పిల్లవాణ్ణి, తన తండ్రి అమితగారాబంగా ఎన్నో ఆశలతో, ఉన్నతాశయాలతో పెంచి పెద్దచేసినవాణ్ణి, తప్పు చేశాడని కోపంవచ్చి, కోపావేశంలో స్వహస్తాలతో కాల్చి చంపేశాను గదా అన్న ఆలోచన రాగానే ఆయనకు దుఃఖం పొంగి వచ్చింది. "ఆవేశం ఎంత చెడ్డది, కోపంలో ఎంత చెడ్డపని చేశాను. వాడొక తప్పు చేశాడన్న కోపంలో అంతకంటె ఎన్నో రెట్లు ఘోరమైన నేరం నేను చేశాను" అనుకొంటూ ఆయన తుపాకీ బల్లమీద పడేసి "నాయనా రాజా" అంటూ ముందుకు వెళ్ళారు. కాని అడుగు ముందుకు పడక ముందే ఆయన తూలిపోయారు. మైకం కమ్ముతున్నట్లనిపించింది. తల గిర గిరా తిరుగుతున్నట్లు, తన కాళ్ళ క్రింద నేల కృంగి పోతున్నట్లు అనిపించింది ఆయనకు. కళ్ళు బలవంతాన తెరుచుకొని చూచారు. రాజారావు అందమైన విగ్రహం ఎదుట కన్పించకపొయ్యేసరికి "ఇంకేముంది ! అంతా అయి పోయింది" అనుకొన్నారు. ఆ మాట పెద్దగానే అంటూ దుఃఖం, ఆవేశం ఆపుకోలేక పెద్దగా ఏడుస్తూ, తూలుతూ కుర్చీలు పట్టుకొంటూ గోడ దగ్గరకు వెళ్ళారు.

తీరా అక్కడకు వెళ్ళేసరికి ఒక్కసారి ఎవరో తన రెండు కాళ్ళూ గట్టిగా పట్టుకొన్నట్లనిపించింది ఆయనకు.

ఉమాపతిగారు గాబరాపడుతూ క్రిందకు చూచారు.

కొడుకు కనిపించాడు. అతను ఇంకా ప్రాణాలతో బ్రతికి ఉన్నట్లు అనిపించింది. అందుకాయన మొదట ఎంతో సంతోషించారు. అంతలో ఆశ్చర్యపడ్డారు. మళ్ళీ ఇంతలో అనుమానపడ్డారు. నెత్తురు మడుగుకోసం వెతుకుతున్నట్లుగా నేలవైపు అటూఇటూ చూచారు. మళ్ళీ అంతలోనే నేలంతా కలయచూచారు. మరుక్షణంలో అతన్ని చప్పున లేవనెత్తారు. ముందు అతని రొమ్ముపైన అరచేత్తో తాకారు. ఆ తర్వాత పిచ్చిగా ఒళ్ళంతా తడిమిచూచారు. అంతసేపూ ఆయన వెక్కి వెక్కి ఏడుస్తూనే ఉన్నారు తాను ఏం చేస్తున్నదీ ఆయనకే తెలియదు. రెండు మూడు నిము షాలకుగాని కొడుక్కు గుండుదెబ్బ తగలలేదన్న విషయం ఆయనకు తెలిసిరాలేదు.

తెలిసి వచ్చాక ఆయనకు కోపం మళ్ళీ ముంచుకొని వచ్చింది.

రాజారావు బుజాలు పట్టుకొని బలంగా ఊపుతూ "అయితే దెబ్బ తగలలేదన్నమాట. నాగురి తప్పిందన్నమాట! ఎలా తప్పిందిరా నాగురి చెప్పు. నువ్వేమిచేశావో చెప్పు. తప్పించుకొని ఎక్కడకు పోతావురా. చెప్పు. నిజం చెప్పు" అన్నారాయన మాటలు తడబడుతూ.

ఆయన తుపాకీమీటమీద వేలు వేసీ వెయ్యగానే అతను చప్పున కూర్చున్నాడు. గుండు దెబ్బ తప్పించుకున్నాడు. ఆయన "చెప్పవేమిరా" అని మళ్ళీ గదిమేసరికి రాజారావు తాను చేసింది చెప్పాడు. ఒక్క ముక్కలో చెప్పి "నాన్నా ఈ ఒక్కసారికీ క్షమించు మళ్ళీ కాల్చకు ఇంకెప్పుడూ ఇల్లాంటిపని చెయ్యను. దివాకర్ స్నేహంలోపడి అతను చెయ్యమన్నదల్లా చేశాను. బుద్ధి గడ్డితిన్నది. ఇంక అతన్ని పల్కరించను ఈసారికి క్షమించు. అసలు విషయం చెప్పడానికే సిగ్గుగా ఉంది. నేరం జరగలేదు. అందుకు ప్రయత్నం మాత్రమే జరిగింది. సుశీల ఎవ్వరికీ

చెప్పదు. ఎక్కడికీ వెళ్ళి ఫిర్యాదు చెయ్యదు. పైగా సుశీలకు నేనంటే అభిమానం. ఆపిల్ల కోరిన ప్రకారం ఇది పరిష్కారం చేద్దాం" అంటూ తండ్రి కాళ్ళమీదపడి క్షమించమని బ్రతిమాలుకొన్నాడు.

ఉమాపతిగారికి కోపం పొంగు చల్లారిపోయింది. రెండోసారి కొడుకు గుండెకు తుపాకీ గురిపెట్టలేకపొయ్యారు. అసలా ఆలోచనే చెయ్యలే దాయన. కాని రాజారావు మాటలమీద విశ్వాసమూ కలుగలేదాయనకు.

కొడుకుమీద అభిమానం ఒకవైపూ—ధర్మం నిర్వహించలేక పొయ్యానే అన్నబాధ మరొకవైపూ పట్టుకొని ఊపివేశాయి ఆయన్ను.

ఆయన కొంతసేపు ఎటూ మొగ్గలేక పొయ్యారు.

మరో నిముషం తర్వాత ఆయన దుఃఖం ఆపుకొంటూ "నీ మాటలు నేను నమ్మలేనురా. ఎంతగోల కావాలో అంతగోలా అవుతుంది. నేనది భరించలేను. ఇంత బ్రతుకూ బ్రతకి నేనీ అప్రతిష్ట భరించలేనురా- పోనీ నన్ను కాల్చరా-నీకు పుణ్యం ఉంటుంది. మరో అప్పుడైతే ఆపని నేనే చేసేవాణ్ణి-నువ్వు నాకీ ఉపకారంచెయ్యి-" అని ఆగి "కాదు; చివరిసారిగా ఆజ్ఞాపిస్తున్నా-" అంటూ బల్లమీద పడి ఉన్న తుపాకీ తెచ్చి అతని చేతికి ఇచ్చి తాను ఎదురుగా దూరంగా నిలబడ్డారు.

తండ్రి వంక కన్నెత్తి చూడలేకపొయ్యాడు రాజారావు. ఆయనకు మతి చలనం కలిగిందేమో అనిపించింది అతనికి.

"కాల్చవేమిరా! ఇంత పిరికి వెధవ్వి అంత దుర్మార్గానికి ఎలా పూనుకొన్నావురా" అని కేకలు పెట్టారు.

ఇంతలో హాలు గుమ్మందగ్గర "అమ్మో! అమ్మో! ఇదేమిటి" అన్న మాటలు కేకల్లా వినిపించాయి. అటు ఉమాపతిగారూ, ఇటు రాజారావూ ఒక్కసారి గుమ్మంవైపు చూచారు.

ముందు సుశీల తల్లీ, ఆవిడ వెనుక సుశీలా కన్పించారు. సుశీల తల్లి హడావిడిగా లోపలకు వస్తూ "ఇదేమిటి? ఈ అఘాయిత్యమేమిటి? ఇక్కడేదో ప్రమాదం జరిగేలా ఉన్నదని భయపడి వాడు-మీ యింటి నౌకరు వచ్చి చెబితే పరుగెత్తుకొని వచ్చాం" అన్నది రొప్పుతూ.

రాజారావు వెంటనే సమాధానం చెప్పకపోయేసరికి ఆవిడ గబగబా ఉమాపతిగారి దగ్గరకు వెళ్ళి "ఏమిటండీ ఇదంతా" అని అడిగింది.

ఉమాపతిగారు కుర్చీ చూపించి ఆవిడను కూర్చోమన్నారు. ఆవిడ కూర్చొన్న తర్వాత తనూ కూర్చొని, ఆయాసపడుతూ, విషయమంతా క్లుప్తంగా చెప్పారు.

సుశీల తల్లి గుండెబాదుకొంటూ "అమ్మో! అమ్మో! ఎంత పని చెయ్య బోయారండీ అన్నయ్యగారూ! చిన్నవాళ్ళు ఏదో చేశారని పెద్ద వాళ్ళం మనం కూడా ఇంత ఆవేశాలలో పడతామా? కావేషాలు పెంచు కుంటాంటండీ! బిడ్డచేసిన తప్పు ఎటువంటిదైనా కడుపులో పెటుకోక తప్పదు" అన్నది.

ఆవిడ మాటల ధోరణి కనిపెట్టి రాజారావు తుపాకీ గోడకు తగి లించి "ఈ సమయంలో తాతగారుండాలి" అనుకొని గబగబా మెట్లవైపు పరుగెత్తాడు;

సుశీల గుమ్మం దగ్గరే నిలబడ్డది.

రాజారావు మెట్లన్నీ ఒక్క ఊపులో ఎక్కి వెళ్ళి ఆ గది తలుపు గొళ్ళెం తీసుకొని లోపలకు వెళ్ళాడు. మరో పది నిమిషాల తర్వాత తాతగారిని నెమ్మదిగా చెయ్యిపుచ్చుకొని క్రిందకు తీసుకొని వచ్చాడు.

శేషాచలంగారు దగ్గరకు వచ్చేసరికి సుశీల తల్లి "అన్నయ్యగారూ జరిగిందేదో జరిగింది. అదంతా మర్చిపోదాం. నా బిడ్డ భవిష్యత్తు ఇప్పుడు మీచేతిలో ఉన్నది. దీనికి ఇదొక్కటే పరిష్కారం" అంటోంది.

ఉమాపతిగారు తండ్రిని చూచి లేచి నిలబడి "రండి నాన్నగారూ రండి. సుప్రీమ్ కోర్టుకు వెళ్ళినా తప్పని శిక్ష అదుగో ఆపిల్ల ఇట్టే తప్పించేసింది, కేసు కొట్టేసింది, అంత అవమానం చేసినవాణ్ణి క్షమించడానికి ఎంత ఔదార్యం కావాలో మీరే ఆలోచించి చెప్పండి. మన పరువు ప్రతిష్టా, వాడి ప్రాణాలు కాపాడడమే కాకుండా తన భవిష్యత్తు కూడా కాపాడుకొన్నది. సుశీల నిజంగా సుశీల" అన్నారు మహా సంతోషంగా. అని ఏదో స్ఫురణకు వచ్చి సుశీలవైపు చూస్తూ "అదేమిటమ్మా నిలబడే ఉన్నావ్! రా వచ్చి ఇలా కూర్చో" అని కుర్చీచూపించారు.

కాని సుశీల కదలలేదు.

తలవంచుకొని అక్కడే నిలబడ్డది. శేషాచలంగారు నెమ్మదిగా వచ్చి కొడుకుకు దగ్గరగా కుర్చీలో కూర్చున్నాక ఉమాపతిగారు సుశీల తల్లి వంకకు తిరిగి "చూడండి మీరామాట నాన్నగారితో చెప్పండి. ఆయన పెద్దవారు. ఈ యింటికి పెద్ద. ఆయన సరేనంటే దానికి అప్పీలుండదు. వాణ్ణి గారాబంగా పెంచిందీ, ఇంతవాణ్ణి చేసిందీ ఆయనే, పైగా ఆయన లాయరు. వాడికేసు ఆయనది" అన్నారు చిరునవ్వు నవ్వుతూ.

సుశీల తల్లి చెప్పినదంతా విని శేషాచలంగారు "అమ్మయ్య" అంటూ నిట్టూర్చారు. మళ్ళీ అంతలో అందుకొని "సరేనమ్మా మంచిదే;

అల్లాగే చేద్దాం. అంతకంటే కావలసిందేముందీ" అని ఆవిడతో అని, కొడుకువంక చూస్తూ "ఆ బంగారపు బొమ్మ నీ యింటికి కోడలవుతానంటే ఇంక అభ్యంతరం ఏముందీ?" అన్నాడు. మరు క్షణంలో ఆయన దూరంగా మెట్లదగ్గరే నిలబడిపోయిన మనుమడి వైపు తిరిగి పెద్దగా "ఒరేయ్, రాజా—ఈ పిల్ల అయితేనేగాని నీ అటలు కట్టవురా" అన్నారు చిరునవ్వు నవ్వుతూ.

ఆ వారంలోనే హడావిడిగా చాలా పెద్ద ఎత్తున అన్ని ఏర్పాట్లు చేశారు. సుశీలా రాజారావులకు వైభవంగా వివాహం జరిగింది.